## అపొస్తలుడైన పౌలు

# కొలొస్సయులకు వ్రాసిన పత్రిక

ఈ పత్రిక కూడా పౌలుచే వ్రాయబడిందని నిర్ధారించబడినది. అపొస్తలుడైన పౌలు కొలస్సయులను ఉద్దేశించి సమకాలీన సంఘ పరిస్థితులను గూర్చి వ్రాయుచు, తప్పుడు సిద్ధాంతములను బోధించువారి ఉపదేశములను అనుసరించ వద్దనియు, దైవస్వరుపుడైన క్రీస్తు నందు వేరుపారి, ఆయనను హత్తుకొని ఉండవలెనని, దుర్బోధ వలన కలిగిన అక్రమ ప్రవర్తనను చక్కదిద్దు కొనవలెనని హెచ్చరించెను. ఈ పత్రికను పౌలు రోమ చెరసాలలో ఉన్నప్పుడు క్రీ॥శ. 55 సం॥రల నుండి 63 సం॥రల మధ్యకాలంలో ఉన్నప్పుడు వ్రాసి వుండవచ్చును. ఈ పత్రికలో 95 వచనములు, నాలుగు అధ్యాయాలుగా విభజింపబడింది.

### కొలస్సయులకు వ్రాసిన పత్రిక–అనుక్రమణిక

| అధ్యా. వచ | పాఠ్య సారాంశము |
|---|---|
| 1:1-8 | శుభవచనములు |
| 1:9-14 | కృతజ్ఞతా స్తుతి-ప్రార్థన |
| 1:12-23 | క్రీస్తు మూర్తి మత్వము–ఆయన పని |
| 1:24-29 | క్రీస్తు పనిలో పౌలు వంతు |
| 2:1-7 | క్రీస్తు తోటి ఐక్యము |
| 2:8-17 | నిరర్థకమైన తత్వజ్ఞానము |
| 2:18-23 | దేవదూతా రాధన |
| 3:1-4 | క్రీస్తుతో లేపబడినవారి ఫలములు |
| 3:5-11 | అవిధేయుల మీదికి దేవుని ఉగ్రత |
| 3:12-17 | ప్రభువు మిమ్మును క్షమించినలాగున మీరును క్షమించుడి |
| 3:18-25 | క్రైస్తవ కుటుంబ జీవితము |
| 4:1 | యజమానులకు హెచ్చరిక |
| 4:2-6 | ప్రార్థనయందు నిలుకడగా ఉండి కృతజ్ఞతగలవారై ఉండుడి |
| 4:7-9 | తుకికి, ఒనేసిమును పంపుటను గూర్చి |
| 4:10-18 | అభివందనములతో ముగింపు |

# 1వ అధ్యాయము

## శుభవచనములు

కొలొస్సయిలో ఉన్న పరిశుద్ధులకు, అనగా క్రీస్తునందు విశ్వాసులైన సహోదరులకు
దేవుని చిత్తము వలన క్రీస్తుయేసు అపొస్తలుడైన పౌలును, సహోదరుడైన తిమోతియును
శుభమని చెప్పి వ్రాయునది. 2 మన తండ్రియైన దేవుని నుండి కృపయు సమాధానమును
మీకు కలుగును గాక. 3 పరలోకమందు మీకొరకు ఉంచబడిన నిరీక్షణనుబట్టి,
క్రీస్తుయేసునందు మీకు కలిగియున్న విశ్వాసమును గూర్చియు, పరిశుద్ధులందరి మీద
మీకున్న ప్రేమను గూర్చియు మేము విని, 4 ఎల్లప్పుడు మీ నిమిత్తము ప్రార్థనచేయుచు,
మన ప్రభువగు యేసుక్రీస్తు యొక్క తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము.
5 మీయొద్దకు వచ్చిన సువార్త సత్యమును గూర్చిన బోధవలన ఆ నిరీక్షణను గూర్చి మీరు
ఇంతకుముందు వింటిరి. 6 ఈ సువార్త సర్వలోకములో ఫలించుచు, వ్యాపించుచున్నట్టుగా
మీరు దేవుని కృపను గూర్చి విని సత్యముగా గ్రహించిన నాట నుండి మీలో సయితము
ఫలించుచు వ్యాపించుచున్నది. 7 ఎపఫ్రా అను మా ప్రియుడైన తోడిదాసుని వలన మీరు
ఈ సంగతులను నేర్చుకొంటిరి. 8 అతడు మా విషయములో నమ్మకమైన క్రీస్తు పరిచారకుడు;
అతడు ఆత్మయందలి మీ ప్రేమను మాకు తెలిపినవాడు.

## కృతజ్ఞతా స్తుతి - ప్రార్థన

9 అందుచేత ఈ సంగతి వినిననాటనుండి మేమును మీ నిమిత్తము ప్రార్థన
చేయుట మానక, మీరు సంపూర్ణ జ్ఞానమును ఆత్మ సంబంధమైన వివేకమునుగలవారును,
10 ఆయన చిత్తమును పూర్ణముగా గ్రహించినవారునై, ప్రతి సత్కార్యములో సఫలులగుచు,
దేవుని విషయమైన జ్ఞానమందు అభివృద్ధి పొందుచు, అన్ని విషయములలో ప్రభువును
సంతోషపెట్టునట్లు, ఆయనకు తగినట్టుగా నడుచుకొనవలెననియు, 11 ఆనందముతో కూడిన
పూర్ణమైన ఓర్పును దీర్ఘశాంతమును కనుపరచునట్లు ఆయన మహిమ శక్తినిబట్టి సంపూర్ణ
బలముతో బలపరచబడవలెననియు,

12 తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారమగుటకు మనలను
పాత్రులనుగాచేసిన తండ్రికి మీరు కృతజ్ఞతాస్తుతులు చెల్లింపవలెననియు దేవుని
బతిమాలుచున్నాము. 13 ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి
విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారునియొక్క రాజ్య నివాసులనుగా చేసెను.
14 ఆ కుమారునియందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది.

## క్రీస్తు మూర్తిమత్వము - ఆయన పని

15 ఆయన అదృశ్యదేవుని స్వరూపియై సర్వసృష్టికి ఆదిసంభూతుడై యున్నాడు.
16 ఏలయనగా, ఆకాశమందున్నవియు భూమి యందున్నవియు, దృశ్యమైనవి గాని

అదృశ్యమైనవి గాని అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను
అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను
ఆయననుబట్టియు సృజింప బడెను. 17 ఆయన అన్నిటికంటె ముందుగా ఉన్నవాడు; ఆయనే
సమస్తమునకు ఆధార భూతుడు. 18 సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు
అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియై యుండి మృతులలో నుండి
లేచుటలో ఆదిసంభూతు డాయెను. 19 ఆయనయందు సర్వసంపూర్ణత నివసింపవలెననియు,
ఆయన సిలువరక్తముచేత సంధిచేసి, ఆయన ద్వారా సమస్తమును, అవి భూలోక
మందున్నవైనను పరలోకమందున్నవైనను, 20 వాటినన్నిటిని ఆయనద్వారా తనతో సమాధాన
పరచు కొనవలెననియు తండ్రి అభీష్టమాయెను. 21 మరియు గతకాలమందు దేవునికి
దూరస్థులును, మీ దుష్క్రియలవలన మీ మనస్సులో విరోధభావము గలవారునై యుండిన
మిమ్మునుకూడ 22 తన సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్ధోషులుగాను నిరపరాధులుగాను
నిలువబెట్టుటకు ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణము వలన ఇప్పుడు మిమ్మును
సమాధాన పరచెను. 23 పునాదిమీద కట్టబడినవారై స్థిరముగా ఉండి, మీరు విన్నట్టియు,
ఆకాశముక్రింద ఉన్న సమస్త సృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్తవలన కలుగు
నిరీక్షణ నుండి తొలగిపోక, విశ్వాసమందు నిలిచియుండినయెడల ఇది మీకు కలుగును.
పౌలను నేను ఆ సువార్తకు పరిచారకుడనైతిని.

## క్రీస్తు పనిలో పౌలు వంతు

24 ఇప్పుడు మీకొరకు నేను అనుభవించుచున్న శ్రమలయందు సంతోషించుచు,
సంఘము అను ఆయన శరీరము కొరకు క్రీస్తు పడినపాట్లలో కొదువైన వాటియందు
నావంతు నా శరీరమందు సంపూర్ణము చేయుచున్నాను. 25 దేవుని వాక్యమును, అనగా
యుగములలోను తరములలోను మరుగు చేయబడియున్న మర్మమును సంపూర్ణముగా
ప్రకటించుటకు, మీ నిమిత్తము నాకు అప్పగింపబడిన దేవుని ఏర్పాటు ప్రకారము, 26
నేను ఆ సంఘమునకు పరిచారకుడనైతిని. 27 అన్యజనులలో ఈ మర్మము యొక్క
మహిమైశ్వర్యము ఎట్టిదో అది, అనగా మీ యందున్న క్రీస్తు మహిమ నిరీక్షణయై యున్నాడను
సంగతిని దేవుడు తన పరిశుద్ధులకు తెలియపరచగోరి ఇప్పుడు ఆ మర్మమును వారికి
బయలుపరచెను. 28 ప్రతి మనుష్యుని క్రీస్తునందు సంపూర్ణునిగా చేసి ఆయనయెదుట
నిలువ బెట్టవలెనని, సమస్తవిధములైన జ్ఞానముతో మేము ప్రతి మనుష్యునికి బుద్ధిచెప్పుచు,
ప్రతి మనుష్యునికి బోధించుచు, ఆయనను ప్రకటించుచున్నాము. 29 అందునిమిత్తము
నాలో బలముగా, కార్యసిద్ధి కలుగజేయు ఆయన క్రియాశక్తిని బట్టి నేను పోరాడుచు
ప్రయాసపడుచున్నాను.